వెంటాడుతున్న భయాలు

చిగురిస్తున్న ఆశలు..

బోధన్, ఫిబ్రవరి 8: నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామన్న సర్కారు ప్రకటనలు రైతుల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి. అదే సమయంలో భయాలు సైతం వెంటాడుతున్నాయి. పునరుద్ధరణ నెపంతో కొంతమంది కాంగ్రెస్ నేతలు ఫ్యాక్టరీ ఆస్తులపై కన్నేసినట్లు ప్రచారం జరుగుతున్నది. ఒకప్పుడు ఆసియాలోనే అతిపెద్ద చక్కెర కర్మాగారంగా పేరొందిన నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పునరుద్ధరణ కోసమని ఓ కమిటీ ఏర్పాటు చేసింది. నిజాం షుగర్స్ పునరుద్ధరణకు తగిన సలహాలు, సిఫార్సులు చేయాలని కమిటీకి సూచించింది. అయితే, కాలయాపన చేయడానికే కమిటీ వేశారని ఇటు రైతాంగం, అటు కార్మికవర్గం భావిస్తున్నది. మరోవైపు, ప్రభుత్వం నేరుగా ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోకుండా మరోసారి ప్రైవేట్‌పరం చేయాలన్న ఆలోచనలో ఉందన్న సమాచారం వారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నది. నిజాం షుగర్స్ పునరుద్ధరణ అంశం రాజకీయ శక్తుల జోక్యంతో సంక్లిష్టంగా మారుతుందన్న భయం కార్మికులు, కర్షకులను వెంటాడుతున్నది.

మళ్లీ మొండి 'చెయ్యే'నా..?

నాడు సభాసంఘం సిఫార్సులను అమలుచేయని కాంగ్రెస్ పాలకులు.. ఇప్పుడు మరోసారి నిజాం షుగర్స్ పునరుద్ధరణ పాట ఎత్తుకున్నారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణ కోసం రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చైర్మన్‌గా, ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, టి.జీవన్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్‌రావు, ఉన్నతాధికారులు సభ్యులుగా ఒక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇప్పుడు ఈ కమిటీలో ఉన్న ప్రజాప్రతినిధులంతా అప్పటి శాసనసభలో ఉన్నారు. నాడు సభా సంఘం నివేదికను బుట్ట దాఖలు చేసిన విధంగానే.. ఇప్పుడు మరో కమిటీ పేరిట కాలయాపన చేస్తారా? అన్న ఆందోళన సహజంగానే కార్మిక, కర్షకులను వెంటాడుతున్నది.

ప్రైవేటీకరణను అడ్డుకోని కాంగ్రెస్..

నిజాం పాలనలో 1937లో బోధన్ కేంద్రంగా స్థాపించిన షుగర్ ఫ్యాక్టరీ.. ఆసియా ఖండంలోనే అతిపెద్ద కర్మాగారంగా పేరొందింది. ఈ ఫ్యాక్టరీ లాభాలతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరు చక్కెర కార్మాగారాలు, మూడు ఆల్కాహాల్ డిస్టిల్లరీలను, నాగార్జునసాగర్‌లో మెషినరీ యూనిట్‌ను ఏర్పాటుచేశారు. ఇటువంటి గొప్ప ప్రభుత్వరంగ సంస్థను నాటి సీమాంధ్ర పాలకులు తమ అరాచక విధానాలతో నష్టాల ఊబిలోకి నెట్టారు. తెలుగుదేశం, కాంగ్రెస్ పాలకులు పోటీపడి ఈ సంస్థను నాశనం చేశారు. చివరికి అప్పటి సీఎం చంద్రబాబు ఈ ఫ్యాక్టరీని జాయింట్ వెంచర్ పేరిట డెల్టా పేపర్ మిల్స్ లిమిటెడ్‌కు అప్పగించాడు. నిజాం షుగర్స్ మూడు యూనిట్లను జాయింట్ వెంచర్ పేరిట కారుచౌకగా డెల్టా పేపర్ మిల్స్ యజమాని గోకరాజు గంగరాజు స్వాధీనం చేసుకున్నారు. నాడు బీఆర్ఎస్ ఈ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేయగా, కాంగ్రెస్ నాయకులు పట్టనట్టు వ్యవహరించారు. ఫలితంగా, 2002లో నిజాం షుగర్స్ యూనిట్లు శక్కర్‌నగర్ (బోధన్), ముత్యంపేట్ (మెట్‌పల్లి), ముంబాజీపల్లి (మెదక్) యూనిట్లు ప్రైవేట్‌పరమయ్యాయి.

సభాసంఘం పేరిట నాటకం..

2004 అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే నిజాం షుగర్స్ ప్రైవేటీకరణ పేరిట జరిగిన అక్రమాలపై విచారణ జరుపుతామని, ప్రైవేట్ యాజమాన్యం నుంచి ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుంటామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత నిజాం షుగర్స్ ప్రైవేటీకరణపై శాసనసభా సంఘాన్ని ఏర్పాటుచేశారు. ఆ సభాసంఘంలో ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కూడా సభ్యుడిగా ఉన్నారు. చంద్రబాబు హయాంలో ఫ్యాక్టరీ ప్రైవేటీకరణలో జరిగిన అక్రమాలపై విచారణ కోసం ఈ శాసన సభాసంఘాన్ని నియమించారు. సభాసంఘం 2006లో సమర్పించిన తన నివేదికలో నిజాం షుగర్స్ ప్రైవేటీకరణ అక్రమమని, ఇందుకు పాల్పడినవారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని, ఫ్యాక్టరీని ప్రభుత్వం బేషరుతుగా స్వాధీనం చేసుకోవాలని సిఫార్సులు చేసింది. అయితే, కాంగ్రెస్ పాలకులు పదేళ్ల పాలనలో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పైగా ప్రైవేట్ యాజమాన్యానికి పత్తాసుగా నిలబడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. 2002లో ఫ్యాక్టరీని తన అధీనంలోకి తీసుకున్న ప్రైవేట్ యాజమాన్యం రెండు, మూడేళ్లపాటు లాభాలను చూపించింది. ఆ తర్వాత వరుసగా నష్టాలు చూపిస్తూ... ఫ్యాక్టరీని సంక్షోభంలోకి నెట్టింది., చివరికి 2015 డిసెంబర్‌లో లేఆఫ్ ప్రకటించటంతో నిజాం షుగర్స్ మూతపడింది.

ఆస్తులపై కాంగ్రెస్ నేతల కన్ను..

కమిటీ ఏర్పాటు ఏమో కానీ మరో విషయం రైతులను భయాందోళనకు గురి చేస్తున్నది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు.. ఫ్యాక్టరీ పునరుద్ధరణ పేరిట ఆస్తులను సొంతం చేసుకోనున్నారనే ప్రచారం జరుగుతున్నది. నిజాం షుగర్స్‌ను మరోసారి ప్రైవేటీకరణ చేయ డం, కొత్త యజమానులకు ఫ్యాక్టరీలను అప్పగించడం కోసమే రేవంత్‌రెడ్డి ప్రభు త్వం కమిటీ ఏర్పాటు నాటకానికి తెర తీసిందన్న చర్చ విస్తృతంగా సాగుతున్న ది. నిజాం షుగర్స్ యూనిట్లపై, ఆ ఫ్యాక్టరీ ఆస్తులపై కొంతమంది బడా కాంగ్రెస్ నేతలు కన్నేసినట్లు తెలిసింది. ఫ్యాక్టరీ పునరుద్ధరణ పేరిట ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం జరిగితే, విలువైన ఫ్యాక్టరీ భూములు, ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చన్న కుట్రకు కొంతమంది అధికార పార్టీ నాయకులు తెర లేపినట్లు ప్రచారం జరుగుతున్నది. నిజాం షుగర్స్ ప్రారంభం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతులు, కార్మికులకు ఈ రాజకీయ జోక్యం, ఫ్యాక్టరీ ఆస్తులపై కొందరు కన్నేశారన్న వార్తలు భయాన్ని కలిగిస్తున్నాయి. ఫ్యాక్టరీకి విశాలమైన భూములు, స్థలాలు, వ్యవసాయ భూములు ఉన్నాయి. వందల కోట్ల విలువచేసే ఈ భూములపై కన్ను పడితే.. నిజాం షుగర్స్ పునరుద్ధరణ మాట ఎలా ఉన్నా ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్ వ్యక్తులపరమయ్యే అవకాశం లేకపోలేదు. అసలు ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణపై సరైన ఎజెండాను రూపొందించకపోవడమే ఈ ప్రచారానికి బలం చేకూరుస్తున్నది.

- నిజాం షుగర్స్ పునరుద్ధరణపై సందిగ్ధత
- పునరుద్ధరణ పేరిట మరోసారి ప్రైవేటీకరణ తంత్రం?
- ఫ్యాక్టరీ ఆస్తులపై కన్నేసిన కొంతమంది కాంగ్రెస్ బడా నేతలు
- కమిటీల పేరిట కాంగ్రెస్ సర్కారు కాలయాపన
- చెరుకు రైతులు, కార్మికుల్లో ఆందోళన

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రి జోగు రామన్న

కేసీఆర్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

- అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇచ్చాం
- మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను నెరవేర్చాలి: మాజీ మంత్రి జోగు రామన్న
- ఆర్మూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 8: కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి జరిగిందని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. పట్టణంలోని ఎమ్మార్ గార్డెన్‌లో గురువారం బీఆర్ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జీవన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా.. మాజీ మంత్రి జోగు రామన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని కులాలు, మతాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఆర్మూర్‌ను పదేండ్లలో ఎంతో అభివృద్ధి చేశానని, ఇది నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. ఎటు చూసినా బీటీ రోడ్లు కనిపిస్తున్నాయే తప్ప మట్టి రోడ్లు కనబడడంలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలి: మాజీ మంత్రి జోగు రామన్న

దేశంలో ఎక్కడా లేని విధంగా పదేండ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఏకైక సీఎం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి మన రాష్ట్రంలోనే జరిగిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. అమలుచేసేవరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఓటరు తుది జాబితా విడుదల

- నిజామాబాద్ జిల్లాలో 14,06,785 మంది, కామారెడ్డిలో 6,77,936 మంది ఓటర్లు
- రాజకీయ పార్టీల ప్రతినిధులకు జాబితా అందజేసిన కలెక్టర్లు

కామారెడ్డి/కంఠేశ్వర్, ఫిబ్రవరి 8: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024 జనవరి ఒకటో తేదీ నాటికి అర్హత కలిగిన ఓటరు తుది జాబితాను నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్ గురువారం వేర్వేరుగా విడుదల చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తుది జాబితాను విడుదల చేసి వారికి అందజేశారు. తహసీల్ కార్యాలయాలతోపాటు కలెక్టరేట్‌లో నోటీసు బోర్డుపై ప్రదర్శించామని కలెక్టర్లు ఈ సందర్భంగా తెలిపారు.

నిజామాబాద్ జిల్లాలో..				
నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆర్మూర్	98116	112612	06	210734
బోధన్	105609	115701	04	221314
బాన్సువాడ	93266	102415	13	195694
నిజామాబాద్ అర్బన్	144645	154961	41	299647
నిజామాబాద్ రూరల్	118607	135523	06	254136
బాల్కొండ	103995	121263	02	225260
మొత్తం	664238	742475	72	1406785
కామారెడ్డి జిల్లాలో..				
కామారెడ్డి	122238	132013	20	254271
జుక్కల్	99113	102813	09	201935
ఎల్లారెడ్డి	106373	115355	02	221730
మొత్తం	327724	350181	31	677936

శాసన సభ బడ్జెట్ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. సమావేశాలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, లక్ష్మీకాంతారావు హాజరయ్యారు.

బడికి వెళ్లమని మందలించినందుకు
విద్యార్థిని ఆత్మహత్య

భారతి (ఫైల్)

రామారెడ్డి , ఫిబ్రవరి 8: పాఠశాలకు వెళ్లాలని తండ్రి మందలించడంతో ఓ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్నది. స్థానిక ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డికి చెందిన గోసంగి సాంబకు ముగ్గురు భార్యలు. మొదటి భార్య కూతురైన కోదండం భారతి (15) స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నది. గురువారం ఉదయం భారతిని పాఠశాలకు వెళ్లాలని తండ్రి మందలించి భార్యతో కలిసి ఉప్పల్‌వాయిలో కూలీ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం వారు ఇంటికి తిరిగి రాగా.. లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. దీంతో కిటికీలో నుంచి చూడగా భారతి ఉరేసుకొని కనిపించింది. తలుపులను పగులగొట్టి చూడగా అప్పటికే ఆమె మృతిచెందిందని ఎస్సై తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 8 : పోలీస్‌శాఖలో ఉన్నతాధికారులకు తప్పడు సమాచారాలు ఇచ్చి పక్కదోవ పట్టించిన ఘటన నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వెలుగుచూసింది. దీంతో సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ ఆ ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్వర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కిరణ్‌గౌడ్ నెల రోజుల క్రితం సిక్ లీవ్ పెట్టాడు. అలాగే నవీపేట్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ అనిల్‌కుమార్ తన తండ్రికి అనారోగ్యంగా ఉందని వారం పాటు సెలవు కోసం అధికారులకు దరఖాస్తు చేసుకొని వెళ్లాడు. వారు ఇద్దరు సెలవు కోసం చూపించిన కారణాలు సరైనవి కావని, తప్పుడు సమాచారంతో సెలవు తీసుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన సీపీ కల్మేశ్వర్.. వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.